ఆషాఢ మాసం శుక్రవారం పూజలు



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీలోని కనకదుర్గాదేవి, శీతలదేవి, కాళికాదేవి ఆలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు మహిళలకు కుంకుమ, గాజులు అందజేశారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



కూకట్‌పల్లి: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులకు బ్యాగ్ కిట్లను తన సొంత నిధులతో అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంతోష్, ప్రభాకర్, చైతన్య, సంతోష్ యాదవ్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం!

ఈ నెల 5 నుంచి 9 వరకు బృహత్తర కార్యక్రమం

- గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాల నిర్వహణకు సన్నద్ధం
- మార్గదర్శకాలను జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: గ్రామాలు, పట్టణాల్లో ఈ నెల 5 (సోమవారం) నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం – పచ్చదనం' పేరిట అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా మొక్కల పెంపకం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాలు ,61 గ్రామ పంచాయతీల్లో ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో.. వివిధ శాఖల సమన్వయంతో' స్వచ్ఛదనం–పచ్చదనం' విజయవంతంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

కార్యక్రమం ఇలా...

స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలోభాగంగా 5 రోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చివేయాలి. మరుగుదొడ్లను వినియోగించేలా ప్రోత్సహించాలి. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రైడే పాటించడం, రక్షిత మంచినీటి ట్యాంకులు, మినీట్యాంకులు, పశువులు తొట్లను శుభ్రం చేయడం, లీకేజీలను అరికట్టడం, దోమల నివారణకు మందు పిచికారీ చేయించటం వంటి పనులు చేపట్టాల్సి ఉంటోంది. ఎండిన మొక్కలు తొలగించి కొత్త మొక్కలు నాటాల్సి ఉంటోంది.



ఈ నెల 5న (ఒకటో రోజు) గ్రామాలు, పట్టణాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాలు, యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇళ్లలోని చెత్తను సేకరించి కంపోస్టు ఎరువులు తయారుచేయాలి. పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాలను శుభ్రపరచాలి. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలి. మరుగుదొడ్లు లేని వారికి వాటిని మంజూరు చేయాల్సి ఉంటోంది.

ఈ నెల 6న (రెండోరోజు) తాగునీటి వనరులను శుభ్రపరచటం, రోజూ క్లోరినేషన్ నిర్వహించేలా చైతన్య పరచటంతోపాటు క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి చెరువులు, కుంటలు కలుషితం కాకుండా స్థానికులకు అవగాహన కల్పించాల్సి ఉంటోంది.

7న (మూడో రోజు) మురుగు కాల్వల్లో పూడిక తొలగించాలి. వర్షం, మురుగునీరు నిలవకుండా డ్రైనేజీల్లోకి మళ్లించాలి. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. స్థానిక రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చాలి. తాగునీటి చేతిపంపులు,డ్రైనేజీల్లో మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి.

8న (నాలుగో రోజు) వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి వాటిపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలి. ప్రజలు తరచూ జ్వరం బారిన పడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వినియోగించాలి. వీధికుక్కల సంఖ్య తేల్చి గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో వాటిని ఏబీసీ కేంద్రాలకు తరలించాలి.

9న (ఐదో రోజు) శుక్రవారాలను డ్రైడేలుగా పాటించటంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలి. రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తీసేసి, కొత్త మొక్కలను నాటాల్సింటోంది.

ఎప్పటికప్పుడు నివేదిక

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్ ఏరోజుకారోజు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేయాలి. పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్త, మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం గ్రామ స్థాయిలో కార్యక్రమ అమలుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రామాల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన నివేదికను పంచాయతీ ప్రత్యేకాధికారి, జిల్లా అధికారులకు పంపించాలి. పట్టణ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల నివేదికలను కలెక్టర్‌కు ప్రత్యేకాధికారి, వార్డు అధికారులు సమర్పించాల్సి ఉంటుంది.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న వృద్ధులు, సిబ్బంది

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్ అవంతి నగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో జాతీయ పోషక ఆహార సంస్థ ఎన్‌ఐఎన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. వైద్య శిబిరం వారం రోజులు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, బాల్‌రెడ్డి, లక్ష్మీ రవీందర్, తుల్జారాం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

ఆల్విన్‌కాలనీ: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు డీఈ రమేష్, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న తల్లులు, ఆశావర్కర్‌లు

ఆల్విన్‌కాలనీ: హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ అరుణజ్యోతి మాట్లాడుతూ.. పుట్టినప్పటి నుంచే చిన్నారులకు తల్లిపాలు అందిస్తే భవిష్యత్‌లో రోగాలు రాకుండా ఉండటానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రగతినగర్ టీచర్ అరుంధతి, సునీత, ఏఎన్‌ఎం మంజుల, ఆశా వర్కర్స్, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ కొని.. తంటాలు పడి

- బ్యాటరీ సరిగ్గా పనిచేయక ఇబ్బందులు
- కొత్త బ్యాటరీతోపాటు రూ.25 వేలు అదనంగా చెల్లించండి
- కంపెనీని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన వినియోగదారుల కమిషన్–1

సిటీ కోర్టులు: ఎలక్ట్రిక్ స్కూటర్‌కి నాసిరకం బ్యాటరీ అమర్చినందుకు పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్–1 ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కచ్చితంగా కంపెనీ, షోరూం సిబ్బంది అలసత్వమే అని స్పష్టం చేసింది. కంపెనీ జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇలాంటి తప్పులకు తావు లేకుండా ఉండేదని సూచించింది. వినియోగదారుడి ఇబ్బందుల దృష్ట్యా రూ.20 వేల నష్ట పరిహారంతో పాటు రూ.5 వేలు కోర్టు ఖర్చులు ఇవ్వాలని కంపెనీకి కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు హైదరాబాద్–1 కమిషన్ అధ్యక్షురాలు ఉమా వెంకట సుబ్బలక్ష్మి, సభ్యులు లక్ష్మీప్రసన్న, మాధవిలతతో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది.

22 నెలల్లో 8 సార్లు బ్యాటరీ సమస్య..

హైదరాబాద్ (మారుతీనగర్ ఓల్డ్ బోయిన్‌పల్లి)కి చెందిన శ్రీనివాస్ రెడ్డి 2021లో పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంబంధించి ఈ డ్రైవ్ మున్నంగి మోటర్స్ షోరూంలో ఎలక్ట్రికల్ స్కూటర్ (పీయూఆర్ – ఈ – ప్లూటో – 7జీ) ను రూ. 90 వేలతో కొనుగోలు చేశాడు. ఒకసారి చార్జింగ్ పెడితే రెండు, మూడు రోజుల కంటే ఎక్కువ రాకపోవడం, ఎక్కడపడితే అక్కడ అకస్మాత్తుగా ఆగిపోవడం వంటి పలు రకాల సమస్యలతో ఆయన ఇబ్బంది పడుతూనే ఉన్నాడు. దాదాపు 22 నెలల కాలంలో 8 సార్లు బ్యాటరీ సమస్యతో సర్వీస్ సెంటర్‌కి వెళ్లాల్సి వచ్చింది. చాలాసార్లు కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది. కొంత కాలానికి పరిశీలించిన సర్వీస్ సెంటర్ సిబ్బంది సాఫ్ట్‌వేర్ సమస్య ఉందని చెప్పినా దానికి సరైన పరిష్కారం మాత్రం చూపలేదు. అనంతరం షోరూం సిబ్బంది ఆగస్టు, 2022లో మరో బ్యాటరీని అమర్చారు. దీంతో ఆనందంతో స్కూటర్ తీసుకొని వెళ్లిన శ్రీనివాస్ రెడ్డికి తిరిగి 9 నెలల కాలంలో మళ్లీ అదే సమస్య ఎదుర్కొన్నాడు. దీంతో తిరిగి మళ్లీ షోరూం సిబ్బంది సంప్రదించాడు. అయితే వారు బ్యాటరీని కంపెనీకి టెస్టింగ్ కోసం పంపాలని, తిరిగి బ్యాటరీ అమర్చాలంటే దాదాపు 3 నుంచి 4 నెలల కాలం పడుతుందని, అంతవరకు ఆగాలని జులై, 2023లో చెప్పారు. అయితే ఇప్పటికీ ఏడాది కాలం దాటినా బ్యాటరీ మాత్రం అమర్చలేదు. ఆ స్కూటర్ బ్యాటరీ లేకుండా నిరుపయోగంగానే ఉన్నది. దీంతో బాధితుడి సంబంధిత షోరూంకి వెళ్లి స్కూటర్‌ని తీసుకెళ్లి డబ్బును ఇవ్వండి, లేదా బ్యాటరీ అయినా మార్చి ఇవ్వండి అని అడిగారు. కంపెనీ యాజమాన్యం, షోరూం సిబ్బంది పట్టించుకోకపోవడంతో హైదరాబాద్ వినియోగదారుల కమిషన్–1ను ఆశ్రయించి తన గోడును విన్నవించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన కమిషన్ కంపెనీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వినియోగదారులకు సరైన సౌకర్యం ఇవ్వకుండా కాలయాపన చేయడమేంటని మండిపడింది. బాధితుడి ఎలక్ట్రిక్ స్కూటర్‌కు వెంటనే కొత్త బ్యాటరీ అమర్చాలని సూచించింది. అంతేకాకుండా మళ్లీ ఎలాంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కంపెనీని ఆదేశించింది. దీంతో పాటు అతనికి చెల్లించాల్సిన నష్టపరిహారం కూడా 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఓ మురళి, ఎంటమాలజీ సిబ్బంది తదితరులు

మూసాపేట: దోమల నివారణకు ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ మూసాపేట సీఓ మురళి అన్నారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా డివిజన్ పరిధిలోని ముష్కిపేట్, మూసాపేటలో ఇంటింటికీ తిరిగి దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల ద్వారా విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయని వివరించారు. నీటిలో పెరిగే దోమలను పిల్ల దశలో నిర్మూలించటం ద్వారా దోమలను అరికట్టవచ్చునని అన్నారు. ఇంట్లో ఉండే నీటి నిల్వలు, డ్రమ్ములు, సిమెంటు తొట్టెలు, కుండీలు, కూలర్లు, పూలకుండీల వద్ద నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీలు గాయత్రి, చందన, మహిళా సంఘాల సభ్యులు ఈఎఫ్‌ఏ సూపర్‌వైజర్ యాదిలాల్, ఎంటమాలజీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన ప్రాముఖ్యతను గుర్తించాలి

రాయదుర్గం: ఎప్పటిలాగానే మత రాజకీయాలతో గెలుస్తామని భావించిన బీజేపీకి ఈసారి ఎన్నికలు చెంపపెట్టు అని హెచ్‌సీయూ ప్రొఫెసర్ తన్వీర్ ఫజల్ అన్నారు. హెచ్‌సీయూలో ఎస్ఎస్‌యూఐ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో జనరల్ ఎలక్షన్స్–2024 : ఇంప్లికేషన్స్ ఫర్ ఇండియన్ డెమొక్రసీ' అనే అంశంపై ప్రత్యేక ప్యానల్ డిస్కషన్‌ను గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కులగణన ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. హెచ్‌సీయూ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ కైలాష్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రాంతీయ పార్టీలకు కూడా స్థానం లభించిందన్నారు. అనంతరం వ్యవసాయ చట్టాల అమలు రద్దుని ఆయన వివరించారు. పలువురు హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు



ఉర్సులో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

ఓల్డ్‌బోయినపల్లి: ఓల్డ్ బోయినపల్లిలోని హజ్రత్ సయ్యద్ నసీరుద్దీన్ షా, క్వాద్రి ఉర్సు ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగయ్య, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇజాజ్, డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, హరినాథ్, ఇలియాజ్, మిరాజ్, యాదగిరి, పెంటయ్య, షకీల్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కుక్క కాటుకు గురైన చిన్నారులకు పరామర్శ



చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలో గురువారం కుక్క కాటుకు గురైన పలు కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. కుక్కలను తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం వాటిని అదే ప్రాంతంలో వదిలి వేస్తున్నారని డాగ్ స్క్వాడ్ టీం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల నియంత్రణకు సరైన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, మధులత, కవిత తదితరులు పాల్గొన్నారు.

22 కుక్కల పట్టివేత

బాలానగర్ డివిజన్ పరిధిలో రెండు డాగ్ స్క్వాడ్ వాహనాలు 22 కుక్కలను శుక్రవారం పట్టుకున్నట్లు కూకట్‌పల్లి జోన్ అధికారి డాక్టర్ కె. నాగార్జున తెలిపారు. గురువారం పలువురిని గాయపరిచిన కుక్కను బంధించి అబ్జర్వేషన్‌లో పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పు ప్రజాస్వామ్య గెలుపు

ఆల్విన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పు ప్రజాస్వామ్య గెలుపు అని కాంగ్రెస్ వివేకానంద నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆల్వాల భాస్కర్ అన్నారు. కూకట్‌పల్లి రిక్షాపుల్లర్స్ కాలనీలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, పూలే విగ్రహాల వద్ద శుక్రవారం మాదిగలు డప్పు కార్యక్రమం నిర్వహించి మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మందకృష్ణ పోరాట ఫలితంగానే ఈ తీర్పు వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో లింగయ్య, భాస్కర్, కృష్ణ, బాబు, ఆంజనేయులు, పరశురాములు, వెంకన్న, చంద్రయ్య, సురేష్, సుధాకర్, కిరణ్, సాయి, శాంసన్, రాజు, వెంకన్న, మల్లేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు ఎమ్మెల్యే వినతి

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సనత్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే బ్రిడ్జి విస్తరణ పనులకు, రైల్వే అండర్ పాస్ నిర్మాణ పనులకు గత ప్రభుత్వంలో శంకుస్థాపన చేశామని తెలిపారు. సనత్‌నగర్ రైల్వే బ్రిడ్జి విస్తరణ పనులను త్వరగా చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ఫ్లై ఓవర్‌బ్రిడ్జి, అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి ఖైతాన్ ఫ్యాన్ రోడ్డు మీదుగా సనత్‌నగర్‌కు వెళ్లే దారిలో రైల్వే అండర్ పాస్ పనులు కూడా త్వరగా చేపట్టాలన్నారు. బాలానగర్ ఫేజ్ 1 కో ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ 47 ఎకరాల భూమిని డబుల్ బెడ్ రూం, వంద పడకల ఆసుపత్రి కోసం, జిల్లా పరిషత్ స్కూల్ కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులకు కేటాయించగా మిగిలిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల కేటాయింపునకు అర్హులను ఎంపిక చేయాలన్నారు.

బిడ్డకు ముర్రుపాలు తాగించాలి

మూసాపేట: మూసాపేట టి.అంజయ్యనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి హాజరై తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. రెండో రోజు డాక్టర్లచే బాలింతలకు అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంగీత, శశికళ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి

దోమల నివారణ చర్యలేవి?



దోమల వృద్ధికి కారణమవుతున్న అంబీర్ చెరువులోని గుర్రపుడెక్క

దోమల బెడదతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సాయంత్రం అయితే చాలు ఆరు బయట, బహిరంగ ప్రదేశాల్లో క్షణం కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. పరిసరాల పరిశుభ్రత లోపించటం, చెత్తా చెదారం తొలగించకపోవటంతో పాటు చెరువుల్లో గుర్రపుడెక్క టన్నుల కొద్దీ పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. అధికారుల పని తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- దోమలకు ఆవాసంగా గుర్రపుడెక్క
- ప్రబలుతున్న విషజ్వరాలు
- ఫాగింగ్, స్ప్రే కూడా చేయని ఎంటమాలజీ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల పరిధిలో ఎంటమాలజీ విభాగంలో పదుల సంఖ్యలో అధికారులు, ఉన్నతాధికారులు, సిబ్బంది ఉన్నారు. క్షేత్ర స్థాయిలో విధుల నిర్వహణలో అలసత్వం కారణంగా పేరుకుపోతున్న మురికి కూపంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారు. దోమల నివారణ కోసం ప్రత్యేక భూమిక పోషించే ఎంటమాలజీ విభాగం పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంటమాలజీ ఆధ్వర్యంలో సర్కిళ్ల పరిధిలోని డివిజన్‌ల వారీగా కొన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ క్షేత్ర స్థాయిలో సరైన చర్యలు తీసుకోవటం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి కాలనీ, బస్తీల్లో, నాలాల వెంట, చెరువుల్లో, కుంటల్లో గుర్రపుడెక్కతో పాటు చెత్తా చెదారం లేకుండా పర్యవేక్షిస్తూ దోమల నివారణ కోసం ఉదయం వేళల్లో డ్రైనేజీ, గుంతల్లోనూ స్ప్రే చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రం ద్వారా పొగను వదలాల్సి ఉంటుంది. కానీ ఎంటమాలజీ సిబ్బంది ఇటువంటి చర్యలు తీసుకోకపోవటం వల్లే దోమల బెడద అధికంగా ఉందని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.

ప్రబలుతున్న విష జ్వరాలు

కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కేపీహెచ్‌బీ డివిజన్‌లలో ప్రజలు అనేక మంది జ్వరం, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో చికిత్స పొందుతున్నారు. చాలీ చాలని జీతాలతో ఆసుపత్రులకు తిరగలేక, చికిత్స పొందే స్తోమత లేక సతమతమవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువుల్లోని గుర్రపుడెక్కను తొలగించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు.

ఫాగింగ్ చేయడం లేదు



దోమల నివారణ కోసం ఎంటమాలజీ సిబ్బంది నెలకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయటం లేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ లోపించింది. దోమల బెడదతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఫోన్ ద్వారా ఎంటమాలజీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కనీసం ఫాగింగ్, దోమల నివారణకు స్ప్రే వెదజల్లటం వంటి చర్యలు తీసుకోవాలి.

– భాస్కర్‌రెడ్డి, సప్తగిరి కాలనీ, కూకట్‌పల్లి

వర్షాలతో విధులకు అంతరాయం

వారం రోజులుగా వర్షాలు కురవటంతో ఫాగింగ్, మందు స్ప్రే పనులకు అంతరాయం కలిగింది. నేటి నుంచి మందు స్ప్రే, ఫాగింగ్ చేస్తాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పూర్తి చేశాం. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపును కూడా త్వరలోనే చేపడతాం. జంట సర్కిళ్ల పరిధిలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం.

– సంధ్య, ఎంటమాలజీ సీనియర్ అధికారి